# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 93 | శనివారం 06, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## తెలంగాణలో సామాజిక న్యాయం విఫలం

**ఈశ్వర్ చారి మరణమే నిదర్శనం**
**ఆయన మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**




## ప్రభుత్వ మోసంతో నిండుప్రాణం బలి

**ఈశ్వర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, (ప్రజాస్వరం):


బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దారుణమైన మోసానికి శ్రీసాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గురువారంఎక్స్ వేదికగా పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ..మిగతా 2లో

## సాగుదాం.. ఎదుగుదాం

**కుడంకుళం ప్రాజెక్ట్ స్పీడ్ అప్**
**మూడో రియాక్టర్‌కు ఇంధన సరఫరా స్టార్ట్**
**పుతిన్ సరికొత్త హామీలు.. భారత్‌కు పూర్తి ఎనర్జీ సపోర్ట్**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**
నాలుగు సంవత్సరాల విరామం తర్వాత భారత్ పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీ లో కీలక సమావేశం నిర్వహించారు. ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, పలు రంగాల్లో కొత్త అవకాశాలపై ఇద్దరు నేతలు విస్తృతంగా చర్చించారు. అనంతరం ఇద్దరూ సంయుక్త విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పుతిన్, దేశంలో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రంగా ఉన్న కుడంకుళం ప్లాంట్‌లో మొత్తం ఆరు రియాక్టర్లు ఉంటాయి. అందులో రెండు ఇప్పటికే గ్రిడ్‌కు అనుసంధానమై విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. మిగతా నాలుగు రియాక్టర్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత భారతదేశ ఇంధన అవసరాలకు ఈ ప్రాజెక్ట్ పెద్ద మద్దతు ఇవ్వనుందని పుతిన్ పేర్కొన్నారు. ఈ కేంద్రంలో 6 VVER1000 రియాక్టర్ల ద్వారా ..మిగతా 2లో





## హెచ్ఎండీఏకు కాసుల వర్షం

**4 విడుతల్లో రూ.3862.8 కోట్ల ఆదాయం**
**నియోపోలిస్ ఎకరం రూ.151.25 కోట్లు**
**గోల్డ్ నైన్‌లో ఎకరాకు రూ.77.75 కోట్లు**
**మూసాపేట భూ వేలం ప్రతిపాదన విత్ డ్రా**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కోకాపేట, మూసాపేటలలో అభివృద్ధి చేసిన భారీ లేఅవుట్‌లలోని ప్లాట్ల వేలం ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. గత నెల 24 నుంచి ఈ నెల 5వరకు నాలుగు విడుతలుగా చేపట్టిన ఈవేలం పాట ద్వారా హెచ్ఎండీఏకు మొత్తం రూ.3862.8 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆదాయం రూ.5 వేల కోట్లు దాటవచ్చని అంచనా వేసినప్పటికీ, అంచనాలు తారుమారై ఆదాయం కొంత తగ్గింది. గతంలో 2023లో నిర్వహించిన వేలంలో కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌లోని ..మిగతా 2లో

# అవసరమైతే ఢిల్లీనైనా ఢీ కొడుతా

**కేంద్రంతో కొట్లాడి రాష్ట్రానికి తీసుకొస్తా**
**మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం**
**త్వరలో మరో 40 వేల కొలువులకు నోటిఫికేషన్లు**
**సర్పైనోడినే సర్పంచ్ అభ్యర్థిగా గెలుపించుకోండి**
**మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసే వారికి ఛాన్స్ ఇవ్వండి**
**బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడగొట్టినా, పార్లమెంట్‌లో గుండు సున్నా వచ్చినా సిగ్గు రాలేదు**
**జూబ్లీహిల్స్‌లో కేటీఆర్‌ను బండకేసి కొట్టినా బుద్ధి రాలేదు**
**అబద్ధాలతో మోసం చేసేందుకు మళ్లీ గ్రామాల్లోకి వస్తున్నారు**
**సర్పంచ్ ఎన్నికల్లో వారికి సలాక కాల్చి వాత పెట్టండి**
**హైదరాబాద్ నగరంలా వరంగల్‌ను తీర్చిదిద్దుతాం**
**నర్సంపేట్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, (ప్రజాస్వరం):

ప్రజలు తనకు అండగ ఉంటే ఢిల్లీని సైతం ఢీ కొడతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి మరీ రాష్ట్రానికి నిధులు తీసుకొస్తానన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడగొట్టినా, పార్లమెంట్ లో గుండు సున్నా వచ్చినా సిగ్గు రాలేదన్నారు. జూబ్లీహిల్స్‌లో కేటీఆర్‌ను బండకేసి కొట్టినా బుద్ధి రాలేదని, మళ్లీ ఇప్పుడు అబద్ధాలతో మోసం చేసేందుకు మళ్లీ గ్రామాల్లోకి వస్తున్నాడని మండిపడ్డారు. ఓట్లు అడిగేందుకు ..మిగతా 2లో

## ఈ సంస్కృతిని అంతం చేయాలి




**ఎన్నికల్లో డబ్బుల పంపిణీ ఆపగలిగేది ప్రజలే..**
**పోటీ చేసేవారు కూడా అడ్డగోలు హామీలు ఇచ్చి ఆగం కావద్దు**
**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**


## ప్రజలారా.. అధైర్యపడొద్దు

**తెలంగాణ పల్లెలకు మళ్లీ మంచి రోజులొస్తాయి**
**మనకు అన్ని కాలాలు అనుకూలంగా ఉండవు**
**కష్టాలకు వెరవకూడదు.. మళ్లీ వచ్చేది మనమే**
**బీఆర్ఎస్ స్ఫూర్తితోనే పల్లెల్లో స్వయం సమృద్ధి**
**కొత్త సర్పంచులకు కేసీఆర్ ఆశీర్వాదం, భరోసా**




## విదేశీ మోడల్ విద్య ఏపీకి తీసుకొస్తాం

**ఫిన్ ల్యాండ్, ఇంగ్లాండ్ విద్యా వ్యవస్థను ప్రవేశపెడతాం**
**ఆంధ్రా విద్యార్థులు అసాధారణ ప్రతిభావంతులు**
**వారికి మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
**ఆడుతుపాడుతూ విద్యను అభ్యసించాలి**
**అప్పడే మెరుగైన ఫలితాలు వస్తాయి**
**మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ లో ఏపీ సీఎం చంద్రబాబు**




## సింగరేణి విజన్ 2047

**అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సింగరేణి లిమిటెడ్**
**2030 నాటికి స్వల్ప, మధ్యకాలిక ప్రణాళిక అమలు**
**2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు టార్గెట్**
**2047 నాటికి దీర్ఘకాలిక ప్రణాళిక రూపకల్పన**
**2047 నాటికి 25 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్**



హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విజన్ 2047కు అనుబంధంగా సింగరేణి కాలరీస్ ..మిగతా 2లో




## ఫ్యూచర్ సిటీలో ఏఐ ఎక్సలెన్స్ సెంటర్

**ప్రపంచ స్థాయి ప్రతిభావంతుల తయారీ లక్ష్యం**
**ఏఐ నైపుణ్యాల కోసం ఆస్ట్రేలియా భాగస్వామ్యం**
**డిజిటల్ ఇండియా భవిష్యత్తుకు గేట్‌వే తెలంగాణ**
**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



## కలిసి సాగుదాం.. కలిసి ఎదుగుదాం

మొదటిపేజీ తరువాయి

సుమారు 6,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యం అవుతుంది.

**ఇంధన సరఫరా ప్రారంభం..**

పుతిన్ వ్యాఖ్యల తరువాత రష్యా అణు సంస్థ రోసాటమ్ కీలక అప్‌డేట్ ఇచ్చింది. కుడంకుళం మూడో యూనిట్‌కు అవసరమైన తొలి యూరేనియం ఇంధనాన్ని కార్గో విమానం ద్వారా భారత్‌కు రవాణా చేసినట్లు వెల్లడించింది. నోవోసిబిర్స్క్ కెమికల్ కన్సెన్ట్రేట్స్ ప్లాంట్‌లో రూపొందిన ఈ ఇంధనం, 2024లో కుదిరిన ఒప్పందం ప్రకారం, 3వ మరియు 4వ రియాక్టర్ల అవసరాలకు అనుగుణంగా మొత్తం ఏడు విమానాల్లో చేరనుంది.

**కొత్త అణు రంగాల్లో భాగస్వామ్యం..**

అణు విద్యుత్ ఉత్పత్తితో మాత్రమే కాకుండా, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తేలియాడే అణు ప్లాంట్లు వంటి ఆధునిక సాంకేతికతలపై కూడా భారత్‌తో కలిసి పనిచేయడానికి రష్యా సిద్ధమని పుతిన్ తెలిపారు. వైద్య రంగం, వ్యవసాయం వంటి విభాగాల్లో అణు టెక్నాలజీ వినియోగంపై రెండు దేశాల మధ్య చర్చలు జరిగినట్లు కూడా వెల్లడించారు.

**ఇంధన భద్రతపై పుతిన్ హామీ..**

భారతదేశానికి అవసరమైన చమురు, సహజ వాయువు, బొగ్గు వంటి ఇంధన వనరుల విషయంలో రష్యా నమ్మకమైన భాగస్వామిగా కొనసాగుతుందని పుతిన్ స్పష్టం చేశారు. వేగంగా ఎదుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఇంధన సరఫరాలో ఏవైనా అంతరాయాలు రాకుండా చూడటం పట్ల రష్యా కట్టుబడి ఉందని చెప్పారు.

# అవసరమైతే ఢిల్లీనైనా ఢీ కొడుతా

మొదటిపేజీ తరువాయి

వచ్చిన వారికి సలాక కాల్చి వాత పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్నికల్లో సరైనోడినే సర్పంచ్‌గా గెలుపించుకోవాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పని చేసుకునే వారినే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలన్నారు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని, గ్రామాల్లో రాజకీయ కక్షలకు తావు ఇవ్వొదని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎప్పుడు వచ్చినా.. కాకతీయులు, సమ్మక్క సారక్క, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి కనిపిస్తుందని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ నేతలు వారి ఆస్తులు పెంచుకున్నారు తప్పా.. నర్సంపేట నియోజకవర్గాన్ని మాత్రం అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. వరి వేసుకుంటే ఉరి అని గత ముఖ్యమంత్రి హెచ్చరించిన పరిస్థితి ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం సన్నవడ్లు పండిస్తే గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నదన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతు భరోసా అందించామని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

**అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ**

25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే దక్కిందన్నారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇవ్వాలంటే వాళ్ల ఆస్తులు రాసిచ్చినట్లు మాట్లాడారన్నారు. కానీ, తమ ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మంది బిడ్డలకు సన్నబియ్యం అందిస్తున్నామని, ఏడాదికి రూ.13 వేల కోట్లు భారమైనా, పేదవాడి ఆకలి తీర్చాలని సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. 2004 నుంచి 2014 వరకు వైఎస్ హయాంలో పదేళ్లలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. రూ.22,500 కోట్లతో ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామన్నారు. నర్సంపేటకు మరో 3,500 ఇండ్లు మంజూరు చేసే బాధ్యత మంత్రి పొంగులేటికి అప్పగిస్తున్నట్లు తెలిపారు.

**హైదరాబాద్‌లా వరంగల్‌ను తీర్చి దిద్దుతాం**

దేశంలో గొప్ప గొప్ప యూనివర్సిటీలను ఏర్పాటు చేసిన ఘనత జవహర్ లాల్ నెహ్రూది అని, సాగునీటి ప్రాజెక్టులను అందించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. కమ్యూనికేషన్ ఇన్ పోర్ట్స్, కమ్యూనికేషన్ ఇన్ టెక్నాలజీ అని అందుకే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలా వరంగల్‌ను తీర్చి దిద్దుతామన్నారు. వరంగల్‌లో ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామన్నారు.



మార్చి 31లోగా వరంగల్ ఎయిర్‌పోర్ట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకున్నదని, అందుకే అన్ని రంగాల్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు మహిళలను బస్సులకు యజమానులను చేశామన్నారు. పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు నిర్వహించుకునేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

**ప్రతీ ఆడబిడ్డకు ఇందిరమ్మ చీరలు**

తెలంగాణలోని ప్రతీ ఆడబిడ్డకు ఇందిరమ్మ చీరలు అందజేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతీ ఆడబిడ్డకు చీర చేరాల్సిందేనని నొక్కి చెప్పారు. అందరికి చీరలు చేరేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలన్నారు. ఇక పిల్లలను చదివించాల్సిన అవసరం ఉన్నదని, అందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన వసతులను అందించే బాధ్యత తనదేనని సీఎం పేర్కొన్నారు. మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 40 వేల ఉద్యోగాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. నిరుద్యోగ యువత బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేయవద్దని, ప్రజల మనసులు గెలుచుకోవాలని సీఎం కోరారు. గ్రామ సమస్యలపై అవగాహన పెంచుకోవాలని, అభివృద్ధి చేయాలని కోరారు.

## ప్రభుత్వ మోసంతో నిండుప్రాణం బలి

మొదటిపేజీ తరువాయి

ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యే అన్నారు. సీఎం తో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్ కు సమాధి కట్టిందన్నారు. బాధితుడి కుటుం



బానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజలారా.. అధైర్యపడొద్దు

- **తెలంగాణ పల్లెలకు మళ్లీ మంచి రోజులొస్తాయి**
- **మనకు అన్ని కాలాలు అనుకూలంగా ఉండవు**
- **కష్టాలకు వెరవకూడదు.. మళ్లీ వచ్చేది మనమే**
- **బీఆర్ఎస్ స్ఫూర్తితోనే పల్లెల్లో స్వయం సమృద్ధి**
- **కొత్త సర్పంచులకు కేసీఆర్ ఆశీర్వాదం, భరోసా**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

'తెలంగాణ పల్లెలకు తిరిగి మంచి రోజులు వస్తాయి. అప్పటి దాకా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడొద్దు' అని మాజీ సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారు. 'మనకు అన్ని కాలాలు అనుకూలంగా ఉండవని, కొన్ని కొన్ని సమయాలు కష్టాలు వస్తాయి. వాటికి వెరవకూడదు, మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంద'ని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలని ఆయన సూచించారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎర్రవెల్లి సర్పంచులు శుక్రవారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచులను శాలువాలతో సత్కరించిన కేసీఆర్, మిఠాయిలు పంచారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని, గ్రామాల్లో వాతావరణం, మౌలిక వసతులు, పంటల సాగుపై ఆరా తీశారు.

**పాలనా సంస్కరణలు దేశానికే ఆదర్శం**

బీఆర్ఎస్ పాలనలో గొప్పగా వర్ధిల్లిన గ్రామాల పరిస్థితి నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని రకాలుగా దిగజారాయని సర్పంచులు కేసీఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధి చెంది, స్వయం పాలిత కేంద్రాలుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని గుర్తు చేశారు. దళిత, గిరిజన, బహుజన మహిళా వర్గాలకు, కుల వృత్తులకు ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, గ్రామీణాభివృద్ధికి అమలు చేసిన పథకాలు, పల్లె ప్రగతికి అందించిన ఆర్థిక సహకారం, పంచాయితీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తోడ్పాటును అందించాయని వివరించారు. తాను ముఖ్యమంత్రిగా చేపట్టిన పాలనా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.

**ఎవరో చేస్తారని ఆశపడొద్దు**

'ఎవరో ఏదో చేస్తారని ఆశలు పెట్టుకొని ఆగం కావద్దు' అని నూతనంగా ఎన్నికవుతున్న సర్పంచులకు కేసీఆర్ సూచించారు. గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రచించుకోవాలన్నారు. గంగదేవిపల్లి లాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకొని, మన పని మనం చేసుకుంటూ, మన పల్లె అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో తమ పల్లెలను సామాజిక ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎర్రవెల్లి గ్రామ సర్పంచ్ నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, ఉప సర్పంచ్ ఎడ్మ సబితా కరుణాకర్, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య సహా ఇరు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



## తెలంగాణలో సామాజిక న్యాయం విఫలం

- **ఈశ్వర్ చారి మరణమే నిదర్శనం**
- **ఆయన మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

హైదరాబాద్, (ప్రజాస్వరం):



రాష్ట్రంలో సామాజిక న్యాయం విఫలమైందని, దానికి ఈశ్వర్ చారి మరణమే నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. ఈశ్వర్ చారి మృతిపై స్పందించిన ఆయన శుక్రవారం ఒక ప్రకటన రిలీజ్ చేశారు. ఈశ్వర్ చారి ఆత్మహత్య బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వ అన్యాయానికి తార్కాణంగా నిలుస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం వల్లే తీవ్ర ఆవేదనకు, నిరాశకు గురై ఈశ్వర్ చారి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ బీసీలను నయవంచనకు గురిచేస్తోందని రాంచందర్ రావు ధ్వజమెత్తారు. ఈశ్వర్ చారి ఆత్మహత్య ప్రభుత్వం చూపుతున్న వివక్షతకు ప్రతిబింబంగా ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈశ్వర్ చారి ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పట్టుపట్టారు. కాంగ్రెస్ అహంకార పాలనకు ఈ ఘటన సాక్ష్యంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్లకు వెంటనే నిధులను విడుదల చేయాలన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుందని, అయితే ఈ రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయలేకపోయిందని రాంచందర్ రావు విమర్శించారు. హామీలను అమలు చేయడానికి బదులు, రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలుచేస్తామని గద్దెనెక్కిన రేవంత్ సర్కార్.. ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో రెండేళ్లుగా అమలుకాని హామీల అమలు కోసం.. ప్రజావంచన కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ ఈనెల 7న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన నాయకులు, కార్యకర్తలు రాంచందర్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు. కాగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

## హెచ్ఎండీఏ కు కాసుల వర్షం

మొదటిపేజీ తరువాయి

ఎకరం భూమి రూ.100.75 కోట్ల రికార్డు స్థాయి ధర పలికిన నేపథ్యంలో, ఈసారి ఆ భూములకు ప్రారంభ ధరను రూ.99 కోట్లుగా హెచ్ఎండీఏ నిర్ణయించింది. ఈ వేలంలో రికార్డు స్థాయిలో ధరలు పలికాయి.

**రికార్డు స్థాయి ధర**

నవంబర్ 29న జరిగిన వేలంలో నియోపోలిస్ లేఅవుట్‌లోని ప్లాట్ నెంబర్ 15 (4.3 ఎకరాలు) లోని ఎకరం భూమి ఏకంగా రూ.151.25 కోట్లు రికార్డు ధర పలికింది. ప్లాట్ నెంబర్ 16 (5.3 ఎకరాలు)లోని ఎకరం భూమి కూడా రూ.147.75 కోట్ల రికార్డు స్థాయి ధర పలికింది. డిసెంబర్ 3న జరిగిన మూడో విడుత వేలంలోనూ నియోపోలిస్ భూములు రికార్డు ధరలు పలికాయి. ఈ విడుతలో ప్లాట్ నెంబర్ 19లో ఉన్న ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లోని ఎకరానికి రూ.118 కోట్ల చొప్పున ధర పలికింది.

**గోల్డ్ మైన్‌లోనూ భారీ ఆదాయం**

శుక్రవారం నిర్వహించిన చివరి, నాలుగో విడుత వేలం పాటలో కోకాపేట గోల్డెన్ మైల్లోని 1.98 ఎకరాల స్థలాన్ని సియోస్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక్క ఎకరాకు రూ.77.75 కోట్లకు సొంతం చేసుకుంది. కాగా, మేడ్చల్ జిల్లాలోని మూసాపేటలో 15 ఎకరాల విక్రయ ప్రతిపాదనను హెచ్ఎండీఏ అధికారులు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. గత నెల 24 నుంచి డిసెంబర్ 3 వరకు నిర్వహించిన మొత్తం మూడు విడుతల్లో 27 ఎకరాల భూ విక్రయంతో రూ.3,708 కోట్ల ఆదాయం సమకూరగా, శుక్రవారం జరిగిన చివరి వేలం ద్వారా మొత్తం ఆదాయం రూ.3862.8 కోట్లకు చేరినట్లు అధికారులు వెల్లడించారు.



## సింగరేణి విజన్ 2047

మొదటిపేజీ తరువాయి

కంపెనీ లిమిటెడ్ కూడా తమ విజన్ 2030 2047 డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో సంస్థ సీఎండీ బలరాం నాయక్ ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. సింగరేణి సంస్థను కేవలం బొగ్గు రంగంకే పరిమితం చేయకుండా, రాష్ట్ర మరియు దేశ అవసరాలకు అనుగుణంగా బొగ్గుతో పాటు ఇతర కీలక రంగాల్లోకి భారీగా విస్తరింపజేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. దేశ విదేశాల్లో కీలక ఖనిజ రంగంలో ప్రవేశించడానికి వీలుగా సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

**2030 స్వల్ప, మధ్యకాలిక ప్రణాళికలు**


విజన్ డాక్యుమెంట్‌లో 2030 వరకు స్వల్ప, మధ్యకాలిక ప్రణాళికలను స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ప్రణాళికల ద్వారా సింగరేణి తన సాంప్రదాయ మరియు పునరుత్పాదక రంగాల్లో గణనీయమైన వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సింగరేణి సంస్థ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం ప్రస్తుత లీజు ప్రాంతాల్లోనే కాక, వివిధ రాష్ట్రాలలోని కొత్త బొగ్గు బ్లాకులను కూడా చేపట్టాలని నిర్ణయించింది. థర్మల్ విద్యుత్ ఉత్పాదనను ప్రస్తుత 1,200 మెగావాట్ల నుంచి 4,400 మెగావాట్లకు పెంచడానికి ప్రణాళికలు రూపొందించింది. అంతేకాకుండా, 202930 నాటికి మొత్తం 5.85 గిగా వాట్ల (5,850 మెగావాట్ల) పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్య సాధనలో భాగంగా సోలార్ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

**గ్లోబల్ సింగరేణి ఏర్పాటు**

2030 నాటికి 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యం కాగా, ఇందులో రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల ప్లాంట్‌తో పాటు, రాష్ట్రంలోని నీటి జలాశయాలపై 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించుకుంది. వీటితో పాటు మణుగూరు వద్ద 200 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్, ఓపెన్ కాస్ట్ డంపులపై 100 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 250 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సింగరేణి సంస్థ తన సంప్రదాయ రంగాలకే పరిమితం కాకుండా, కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించింది. ఈ మేరకు దేశ విదేశాల్లో ఈ రంగంలో గల అవకాశాలను పరిశోధించడం కోసం ప్రఖ్యాత పరిశోధన సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే రాగి, బంగారం అన్వేషణకు లైసెన్స్ సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో ఇటువంటి కార్యకలాపాలు నిర్వహించడానికి వీలుగా సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ అనే అనుబంధ సంస్థను ఏర్పాటు చేయాలని విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు.

**దీర్ఘకాలిక లక్ష్యాలు**

సింగరేణి సంస్థ తన దీర్ఘకాలిక ప్రణాళిక 2047లో అత్యంత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుంది. 2047 నాటికి మొత్తం 25 గిగావాట్ల పరిమాణంలో వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తును (సోలార్, ఫ్లోటింగ్ సోలార్, పంప్డ్ స్టోరేజీ, జియో థర్మల్) ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. పర్యావరణహిత మైనింగ్ చేపడుతూ, వాతావరణ కాలుష్య నివారణ కోసం కోల్ వాషరీలను ఏర్పాటు చేయడం, కోల్ గ్యాసిఫికేషన్, లిక్విఫికేషన్ ప్రణాళికను అమలుచేయడం ద్వారా కర్బన ఉద్గారాలను అదుపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ రంగంలోకి దిగనుంది. మెటల్ మైనింగ్ రంగంలో అన్వేషణ విభాగపు సేవలు అందించనుంది. ఉద్యోగులకు నూతన టెక్నాలజీకి అనుగుణంగా శిక్షణలు ఇవ్వడం, ఆరోగ్య రక్షణ, భద్రత, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.



# విదేశీ మోడల్ విద్య ఏపీకి తీసుకొస్తాం

- **ఫిన్ ల్యాండ్, ఇంగ్లాండ్ విద్యా వ్యవస్థను ప్రవేశపెడతాం**
- **ఆంధ్రా విద్యార్థులు అసాధారణ ప్రతిభావంతులు**
- **వారికి మెరుగైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
- **ఆడుతుపాడుతూ విద్యను అభ్యసించాలి**
- **అప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయి**
- **మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ లో ఏపీ సీఎం చంద్రబాబు**

పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో భారీ ఎత్తున నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వేలాది మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరైన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు, భవిష్యత్ లక్ష్యాలు, కొత్త విద్యా విధానాలపై వివరంగా చర్చించారు.

**ఆడుతూ పాడుతూ చదువుకోవాలి**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, పిల్లలకు పుస్తక చదువుతో పాటు ఆట, పాటలు, సృజనాత్మక కార్యక్రమాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. విద్యార్థుల మానసికాభివృద్ధికి ఇవి ఎంతో అవసరమని అన్నారు.

"మన పిల్లల్లో తెలివితేటలు అసాధారణంగా ఉన్నాయి. తక్కువ సమయం కేటాయించినా, నిజాయితీగా, ఇష్టపడి చదివితే అద్భుత ఫలితాలు వస్తాయి. ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో జనాభా తగ్గిపోతుండగా, భవిష్యత్తులో యువశక్తి ఎక్కువగా ఉన్న దేశం భారత్ అవుతుంది. అందుకే మన పిల్లలకి ఇప్పటి నుంచే బలమైన పునాది వేసి, అన్ని సబ్జెక్టుల్లో స్థిరమైన పట్టు కల్పించాలి," అని సీఎం పేర్కొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల బలాలు-బలహీనతలను అంచనా వేయాలని, లోపాలు గమనించిన వేళ వెంటనే సరిచేయాలని సూచించారు. "ఇది కేవలం స్కూల్ కార్యక్రమం మాత్రమే కాదు... పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన విద్యా సంస్కరణల భాగం," అని ఆయన చెప్పారు.

**2029 నాటికి దేశంలోనే నంబర్ వన్ విద్యా వ్యవస్థ**

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, రెండు దశాబ్దాల తర్వాత విద్యారంగాన్ని పూర్తిగా మలచే స్థాయిలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. "ఉపాధ్యాయుల బదిలీలలో పారదర్శకతను తీసుకొచ్చాం. ఎక్కడైనా అనుమానాలకు తావు లేకుండా పూర్తిగా డిజిటల్ పద్ధతుల్లోనే బదిలీలు జరిగాయి. సమాజం మనందరికీ ఎంతో ఇచ్చింది... ఆ రుణాన్ని 'బడి' ద్వారా తీర్చుకునే అవకాశం ఉంది," అని లోకేశ్ అన్నారు.

చంద్రబాబు ఎప్పటి నుంచో విద్యా వ్యవస్థను దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రధాన ఆధారంగా భావించి పనులు చేస్తారని లోకేశ్ పేర్కొన్నారు. విద్యా విలువలను పెంపొందించేందుకు చాగంటి కోటేశ్వరరావుతో ప్రవచనాలను నిర్వహించినట్లు చెప్పారు.

"పిల్లలతో మాక్ అసెంబ్లీ నిర్వహించగా, ఎమ్మెల్యేలకన్నా గొప్పగా పిల్లలు సమస్యలను విశ్లేషించారు. వారి ఆత్మవిశ్వాసం మనకు ఆశాజనకంగా ఉంది," అని లోకేశ్ అన్నారు.

ఫిన్లాండ్, ఇంగ్లండ్ మోడల్... ఏపీకి

అంతర్జాతీయ ప్రమాణాల్ని అందుకోడానికి పలు కొత్త కార్యక్రమాలు అమల్లోకి వస్తున్నాయని మంత్రి వెల్లడించారు.

భామిని మోడల్ స్కూల్‌లో పైలట్‌గా *క్లిక్కర్ టెక్నాలజీ* ప్రవేశపెడుతున్నారు.

టీచర్లు, విద్యార్థులను *ఫిన్లాండ్, ఇంగ్లండ్* వంటి ఉత్తమ విద్యా విధానాలు అమలు చేస్తున్న దేశాలకు అధ్యయన పర్యటనలకు పంపనున్నారు.

*లీప్ యాప్*' ద్వారా విద్యార్థులు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునే సౌకర్యం కల్పించామని చెప్పారు.

"భారత్‌లో అత్యుత్తమ విద్యా విధానాన్ని 'ఆంధ్ర మోడల్'గా —— రెండు సంవత్సరాల్లో అమలు చేయాలనే సీఎం ఆదేశించారు. అది సాధిస్తామని హామీ ఇస్తున్నాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు విలువైన సూచనలు చేస్తూ మా వెన్నంటే ఉన్నారు," అని లోకేశ్ అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు చిన్నచూపులకు గురికాకూడదని, ప్రతి తల్లిదండ్రి తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మంత్రి పిలుపునిచ్చారు. "మన పాఠశాలల్లో మట్టిలో మాణిక్యాల్లాంటి ప్రతిభావంతులను వెలికి తీయాలి," అని అన్నారు.




# పర్వేద సర్పంచ్‌గా సురేందర్ గౌడ్ ఏకగ్రీవం

- **శంకర్ పల్లి మండలంలో రికార్డ్!**

**శంకర్ పల్లి, డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

శంకర్ పల్లి మండల పరిధిలోని పర్వేద గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అరుదైన రికార్డు నమోదైంది. గ్రామాభివృద్ధి ధ్యేయంగా, పర్వేద గ్రామ ప్రజలంతా ఏకతాటిపై నిలిచి, తమ గ్రామ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో ఎన్కతల సురేందర్ గౌడ్ సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన వివిధ వర్గాల ప్రజలు, రాజకీయాలకు అతీతంగా సురేందర్ గౌడ్‌ను బలపరిచారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నూతన సర్పంచ్‌గా ఎన్నికైన ఎన్కతల సురేందర్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అందరి సహకారంతో పర్వేద గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ ఏకగ్రీవ తీర్మానం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది.



# ఫ్యూచర్ సిటీలో ఏఐ ఎక్సలెన్స్ సెంటర్

- **ప్రపంచ స్థాయి ప్రతిభావంతుల తయారీ లక్ష్యం**
- **ఏఐ నైపుణ్యాల కోసం ఆస్ట్రేలియా భాగస్వామ్యం**
- **డిజిటల్ ఇండియా భవిష్యత్తుకు గేట్‌వే తెలంగాణ**
- **ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రంలో కృత్రిమ మేథకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో శుక్రవారం ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ఈ తరహా నైపుణ్య శిక్షణ కేంద్రం మొట్టమొదటిదని మంత్రి తెలిపారు. డీకిన్ అప్లయిడ్ ఆర్టిఫిషియల్ ఇన్‌స్టిట్యూట్ ఈ ఎక్సలెన్స్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తుందని వివరించారు. కేవలం కాలేజీల నుంచి అకడమిక్ గ్రాడ్యుయేట్లను కాకుండా, ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో కూడిన ప్రతిభావంతులను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆస్ట్రేలియా ప్రభుత్వంతో ఈ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు మంత్రి వివరించారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఒప్పందం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలన, ఆరోగ్యం, విద్య, ఐటీ, లైఫ్ సైన్సెస్, వ్యవసాయం, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మెటల్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధన, నైపుణ్య శిక్షణ అందజేయడానికి ఈ సెంటర్ ఎక్సలెన్స్ ఉపయోగపడుతుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో డిజిటల్ ఇండియా భవిష్యత్తుకు తెలంగాణ ముఖ ద్వారం కానుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా మంత్రి జూలియన్ హిల్, ప్రభుత్వ ఐటీ సలహాదారుడు సాయిక్రిష్ణ, ఇతర ఆస్ట్రేలియా ప్రతినిధులు పాల్గొన్నారు.




# గురుకులంలో దారుణం.. విద్యార్థినిపై మహిళా వైస్ ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు!

- **జడ్చర్ల గురుకులంలో పదో తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులు**
- **వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్‌పై పోక్సో చట్టం కింద కేసు**
- **ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు**

**మహబూబ్‌నగర్ డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

విద్యార్థులకు రక్షణగా నిలవాల్సిన గురుకుల పాఠశాలలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై మహిళా వైస్ ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఉదంతం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్‌పై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జడ్చర్ల మండల కేంద్రంలోని ఓ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి కొంతకాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన షీ టీమ్స్ అవగాహన కార్యక్రమంతో ధైర్యం తెచ్చుకున్న విద్యార్థిని, తనపై జరుగుతున్న అఘాయిత్యాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. విచారణలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి ఆగస్టు నెల నుంచే ఈ వేధింపులకు పాల్పడుతున్నట్లు తేలిందని డీఎస్పీ వెల్లడించారు. నైట్ డ్యూటీ సమయంలో ఆమె విద్యార్థినిని శారీరకంగా, లైంగికంగా వేధించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ప్రిన్సిపాల్ రజని రాగమాల బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను బెదిరించినట్లు కూడా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు, వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ రజని రాగమాల ఇద్దరినీ తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వారిద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పోలీసులు లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ఈ సంస్కృతిని అంతం చేయాల్సింది మీరే..

- **ఎన్నికల్లో డబ్బుల పంపిణీ ఆపగలిగేది ప్రజలే..**
- **పోటీ చేసేవారు కూడా అడ్డగోలు హామీలు ఇచ్చి ఆగం కావద్దు**
- **మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

సర్పంచ్ ఎన్నికల్లో డబ్బుల పంపిణీని ఆపగలిగేది కేవలం ప్రజలు మాత్రమేనని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఈ సంస్కృతిని ప్రజలే అంతం చేయాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్, అసెంబ్లీతో పాటు గ్రామ సచివాలయాలు, మండల, జిల్లా పరిషత్ లు సమర్థవంతంగా పనిచేస్తేనే సమగ్రాభివృద్ధి సాధ్యమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఉండే సమస్యలపై సర్పంచ్ కు ఉన్న అవగాహన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీలకు ఉండదన్నారు. అందుకే గ్రామ సచివాలయాలు ఎంత గొప్పగా పనిచేస్తే ప్రజల సమస్యలు అంత గొప్పగా పరిష్కారమవుతాయని తెలిపారు. కానీ వాటికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేస్తోందని ఈటల విమర్శించారు. కేంద్రం ఇచ్చే పర్ కాపిటా, ఫైనాన్స్ కమిషన్, ఉపాధిహామీ నిధులతో మాత్రమే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. గత సర్పంచ్ లు చేసిన పనులకు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడం వల్ల అనేకమంది సర్పంచ్ లు అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భార్య పుస్తెలు అమ్మి, ఉన్న ఆస్తులు అమ్మి పనులు చేసినా బిల్లులు చెల్లించలేదని ఏడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కమీషన్లు ఇచ్చుకోలేక, ఆఫీసులు చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిందని, ఈ రెండేళ్లలో బిల్లులు చెల్లించలేని, పనులు చేయలేని మంత్రులు ఇప్పుడు వచ్చి సర్పంచ్ లను గెలిపించాలని కోరుతున్నారన్నారు. ఈ మూడేళ్లు పనులు చేస్తామని చెబుతున్నారని, అయినా వారి మాటలపై ఎవరికీ నమ్మకం లేదన్నారు. గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేసింది బీఆర్ఎస్ అని, బిల్లులు పెండింగ్ పెట్టి ఇప్పుడు వచ్చి మళ్లీ ఓట్లు అడుగుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వారితో ప్రజలకు వచ్చేది.., పోయేదేం లేదని ఎద్దేవాచేశారు. ప్రజల మధ్యలో ఉండి, సమస్యలు అర్థం చేసుకుని పరిష్కరించే వారిని ఎన్నుకోవాలని ఈటల పిలుపునిచ్చారు. ఈ పూటకి ఎక్కడి నుండో వచ్చి రూ.లక్షలు ఖర్చు పెట్టి, దావతులిచ్చి, పైసలిచ్చి గెలుస్తామంటే గ్రామాల్లో అభివృద్ధి మరింత కుంటుపడినట్లేనని పేర్కొన్నారు. పోటీ చేసేవారు కూడా అడ్డగోలు హామీలు ఇచ్చి ఆగం కావద్దని ఈటల సూచించారు.

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంట్ లో ఈటల తన గళం వినిపించారు. జవహర్ నగర్ లో 40 ఏండ్ల కిందట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారని, అప్పుడు ఒకట్రెండు, చెత్త వాహనాలు వచ్చి చెత్త వేసేవని తెలిపారు. కానీ ఇవాళ 10వేల టన్నుల చెత్తను ఒకేచోట వేస్తున్నారన్నారు. 30 కిలోమీటర్ల చుట్టూ నివసిస్తున్న లక్షల మంది ప్రజలు డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన, కీటకాల వల్ల అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే చోట ఇంత పెద్ద డంపింగ్ యార్డ్ ఉండొద్దని 1.5 కోట్ల జనాభా ఉన్న హైదరాబాద్ నగరంలో నాలుగు మూలలా డంపిగ్ యార్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# బాలికల మెరుపు ప్రదర్శన...రాష్ట్ర జూనియర్ కబడ్డీలో ఖమ్మంకి మూడో స్థానం

**ఖమ్మం డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలు నల్గొండ జిల్లా హాలియాలో ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగాయి. మొత్తం 33 జిల్లాల జట్లు బరిలోకి దిగిన ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా బాలికలు అద్భుత ప్రతిభ కనబరచి మూడో స్థానాన్ని సాధించారు. ఖమ్మం జట్టు సాధించిన విజయంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి క్రీడాకారిణులను అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు సామినేని హరిప్రసాద్, మోతారపు సుధాకర్, ప్రసాద్ రావు, డాక్టర్ సుధాకర్ తదితరులు జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కటికల క్రిస్టఫర్ బాబు తదితరులు పాల్గొన్నారు.




# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో బండల ఇల్లు దగ్ధం ఎన్కతల లో ఘటన

- **కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**
- **ప్రభుత్వం కొత్త ఇల్లును మంజూరు చేయాలి**

**వికారాబాద్ జిల్లా డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

మోమినిపేట్ మండల పరిధిలో ఎన్కతల గ్రామంలో హరిజనవాడ స్కూల్ దగ్గరలో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు పూర్తిగా దగ్ధమైపోయింది ఇంటిలో ఉండే గృహప్రకరణాలు, బీరువాలో ఉన్న దుస్తులు, మూడు తులాల బంగారం ఫర్నిచర్ కాలి బూడిద అయ్యింది బాధితులు తెలిపిన కథనం ప్రకారం జంగిలి సుశీల లక్ష్మయ్య దంపతులు ఆరోగ్యం బాగా లేనందున ఓ ధవాఖాన కు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యులేట్ తో బండల ఇల్లు కాలిపోయింది, తినే బండారాలు పూర్తిగా దగ్ధమయ్యాయి గ్రామస్తులు గమనించి నీటితో మంటలను ఆర్పేశారు. జంగిలి లక్ష్మయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఇల్లు కట్టించాలని ప్రభుత్వాన్ని గ్రామస్తుల కోరుతున్నారు.



## డిజిటల్ హింస నిర్మూలన థీమ్‌తో
# విద్యార్థులకు అవగాహన

- ప్రతి విద్యార్థి మరో ముగ్గురికి అవగాహన కల్పించాలి
- అదనపు ఎస్పీ ఎస్. మహేందర్

**మెదక్, డిసెంబర్ 05 (ప్రజా స్వరం) :**





మెదక్ మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో మెదక్ బాయ్స్ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్ భరోసా సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై లింగ ఆధారిత హింస నిర్మూలన కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 16రోజుల కార్యక్రమంలో భాగంగానే ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా నిర్ణయించిన 'డిజిటల్ హింస నిర్మూలన' థీమ్‌ను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు డిజిటల్ భద్రత, బాధ్యతాయుత ఆన్‌లైన్ ప్రవర్తనపై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికలపై మహిళలు, పిల్లలు ఎదుర్కొనే ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అత్యంత కీలకమని అన్నారు. ఆన్‌లైన్ హరాస్మెంట్, సైబర్ మోసాలు, లైంగిక దోపిడీ, అసభ్యకర కంటెంట్ ప్రాచుర్యం, ఇంపర్సనేషన్, స్టాకింగ్, ట్రాకింగ్, ఫోటో మోర్ఫింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, డిజిటల్ బ్లాక్‌మెయిల్ వంటి పలు రకాల సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరించారు. డిజిటల్ హింసను నివారించడంలో చట్టపరమైన అవగాహన, ముందస్తు జాగ్రత్తలు, సురక్షిత డిజిటల్ ప్రవర్తన అత్యంత అవసరమని సూచించారు. ఆన్‌లైన్‌లో ఏవైనా అనుమానాస్పద చర్యలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. మహిళలు, పిల్లల భద్రత కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని సానుకూల దిశలో వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి విద్యార్థి కనీసం మరో ముగ్గురికి ఈ అవగాహనను పంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్ర బోస్, జూనియర్ కళాశాలలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ మల్లయ్య, బాయ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మలేష్, పట్టణ ఎస్ఐ అమర్, భరోసా ఎస్ఐ సూచిత, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, భరోసా లీగల్ అడ్వైసర్ శ్వేతా, సైబర్ క్రైమ్ సిబ్బంది, సయ్యద్, సతీష్, సాయి కిరణ్, పాల్గొన్నారు.





## ఎంజేపీ దౌల్తాబాద్ విద్యార్థులకు
# రాష్ట్ర స్థాయి క్రీడల్లో చోటు



**దౌల్తాబాద్, డిసెంబర్ 5(ప్రజాస్వరం) :**

మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో సిద్ధిపేటలో నిర్వహించిన విద్యార్థి క్రీడల్లో గురుకుల పాఠశాలలకు చెందిన హాకీ అండర్-17 విభాగంలో 9 మంది విద్యార్థులు - జె. భవన్, ఏ. అరుణ్ తేజ్, ఆర్. హర్ష వర్ధన్, టి. గోపిచంద్, చ. రిషిక్, ఎం. కౌశిక్, కే. శ్రీకాంత్, కే. వంశీ, జి. శ్రావణ్ - రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్-14 విభాగంలో జి. గిరీష్, చ. చరణ్, యు. శ్రావణ్ ఎంపిక కావడంతో మొత్తం 12 మంది రాష్ట్రస్థాయికి చేరుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్న తెలిపారు. అదే కార్యక్రమంలో పీఎం శ్రీ పాఠశాల విద్యార్థులు ఖోఖో పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించారు. అథ్లెటిక్స్ విభాగంలో జే. భవన్ 100 మీటర్ల పరిగెత్తులో రెండో స్థానం, టి. ప్రవీణ్ దీర్ఘ జంపులో మూడో స్థానం సాధించి ప్రతిభ చాటారు. విద్యార్థులు గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదగడం గర్వించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు స్వప్న అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సాయి కృష్ణ, బస్వరాజ్, డాంబు విద్యార్థులను అభినందించారు.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే
# కఠిన చర్యలు తప్పవు



- ఎస్సై అరుణ్‌కుమార్

**దౌల్తాబాద్, డిసెంబర్ 05 (ప్రజాస్వరం) :**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రచార సమయాలు, వ్యయ నియంత్రణ, ఓటర్లకు ఎలాంటి ప్రలోభాలు, వాగ్దానాలు ఇవ్వకూడదనే అంశాలను స్పష్టంగా వివరించారు. గ్రామాల్లో గుంపులుగా తిరగడం, రాత్రి వేళల్లో అనవసర రాకపోకలు, మద్యం పంపిణీ, డబ్బులు పంచే ప్రయత్నాలు చేస్తే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల భంగం కలిగించే వ్యక్తులపై బౌండోవర్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడమని అన్నారు. పోలీసులు 24 గంటలు నిఘా చేపట్టి, ప్రతి గ్రామంలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజలు కూడా అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సైపాల్గొన్నారు అరుణ్‌కుమార్ కోరారు. వీరితోపాటు కానిస్టేబుల్ విక్రం రెడ్డి తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మహత్యలు చేసుకోవద్దు

- పోరాటాలే హక్కుల సాధనకు మార్గం
- బీసీ నాయకులు బండకింది ప్రసాద్ గౌడ్



**జవహర్ నగర్, డిసెంబర్ 5, ప్రజాస్వరం:**

బీసీ ఉద్యమకారులు ఎవరు అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని బీసీ నాయకుడు బండకింది ప్రసాద్ గౌడ్ అన్నారు. శుక్రవారం బాలాజీ నగర్ లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం లేదంటూ మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిన సాయి ఈశ్వర్ చారి కి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయపార్టీలు వారి స్వలాభం కోసం బీసీల పట్ల కపట నాటకమాడుతున్నాయని బీసీల ఓట్లు కావాలి కానీ, బీసీ రిజర్వేషన్స్ అమలు విషయంలో చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అమలులో చొరవ చూపాలని కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. సాయిఈశ్వరచారీ సంఘటన చాలా బాధాకరమని ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు.

## గ్రేటర్‌లో జవహర్ నగర్
# మున్సిపల్ కార్పొరేషన్ విలీనం




- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న రాజకీయ నాయకులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

**జవహర్ నగర్, డిసెంబర్ 5, ప్రజాస్వరం :**

హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు మున్సిపాలిటీలను రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేశారు. అందులో భాగంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్ఎంసి లో విలీనమైంది జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ వసంత అధికారులకు రికార్డులను జిహెచ్ఎంసి అధికారులకు అందజేసి జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బోర్డు స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జవహర్ నగర్ ప్రాంత సర్కిల్ కు వసంత ను డిప్యూటీ కమిషనర్ గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**జిహెచ్ఎంసి లో విలీనంపై భిన్నాభిప్రాయాలు**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో సుమారు రెండు లక్షల జనాభాతో 28 డివిజన్లు, 120 కాలనీలు ఉన్నాయని జిహెచ్ఎంసి విలీనం కావడంతో అభివృద్ధి చెందుతాయని ఆశిస్తున్నారు.నిర్మాణ అనుమతులు,100 ఫీట్ల ప్రధాన రహదారి,పార్కులు, ఆటస్థలం, బస్టాండ్ ఇతర సదుపాలకు అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు. రాజకీయ పార్టీల నాయకులు మాత్రం కొంతమేర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్,28 మంది కార్పొరేటర్లు కొనసాగారు ప్రస్తుతం జిహెచ్ఎంసి విలీనంతో ఈ ప్రాంతంలో రెండు లేదా మూడు కార్పొరేటర్ స్థానాలు ఏర్పడే అవకాశం ఉన్నందున చాలామంది ఆశావాహులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

## వృథాగా పారుతున్న
# మిషన్ భగీరథ నీరు

**దౌల్తాబాద్ డిసెంబర్ 5( ప్రజాస్వరం) :**




మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీల వల్ల శుక్రవారం భారీగా తాగునీరు వృథాగా పారిపోగా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సదరు పైపులైన్ పలుచోట్ల పగుళ్లు ఏర్పడటంతో గంటలకొద్దీ నీరు రోడ్డుమీదికి చేరి చిన్నపాటి చెరువుల్లా నిల్వ అయ్యింది. గ్రామ ప్రజలు మాట్లాడుతూ "రోజువారీ అవసరాలకు కొన్నిసార్లు ఒత్తిడి తక్కువగా వస్తోంది. కానీ ఇలా లీకేజీల వల్ల నీరు వృథాగా పోతుండటం బాధాకరం. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి" అని కోరారు. స్థానికులు పలుమార్లు మిషన్ భగీరథ విభాగానికి సమాచారం ఇచ్చినప్పటికీ మరమ్మత్తు పనులు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే నీటి ఒత్తిడి తగ్గిపోవడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు మరింత పెరిగే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి లీకేజీలు ఆగేలా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని దౌల్తాబాద్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అప్పుల తడకగా ఓటర్ జాబితా

**దౌల్తాబాద్ డిసెంబర్05 ( ప్రజాస్వరం):**

దౌల్తాబాద్ పట్టణంలో ఓటర్ల జాబితా అనేక తప్పులతో ప్రచారంలోకొచ్చింది. పట్టణానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లు జాబితాలో చేరగా, మరణించిన వారి పేర్లు ఇప్పటికీ తొలగించకపోవటం స్థానికుల్లో అసంతృప్తిని రేకెత్తించింది. ప్రతిసారి జరిగే పునః పరిశీలనలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలా జరుగుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పులను వెంటనే సరిదిద్దుతూ స్పష్టమైన జాబితాను విడుదల చేయాలని వారు కోరుతున్నారు.



| 1482 | ఎ.సి -పి.ఎస్ - వరుస సంఖ్య. : 41 - 141 - 575 |
|---|---|
| ఓటరు పేరు | :నిరుడి అశోక్ |
| తండ్రి పేరు | :నిరుడి సత్తయ్య |
| వయస్సు | :30 లింగము :M |
| ఇంటి నెంబర్. | :4-38 |
| ఎపిక్ | WHS1075549 |



## అవినీతి నిరోధక శాఖ వలలో భారీ అవినీతి తిమింగలం

- 60 వేల లంచం తీసుకుంటూ ఎసిబి వలలో హనుమకొండ అడిషనల్ కలెక్టర్
- విద్యాశాఖ వ్యవహారానికి సంబంధించి ఈ లంచం తీసుకుంటున్నట్టు సమాచారం

**హనుమకొండ డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

అవినీతి నిరోధక శాఖ వలలో భారీ అవినీతి తిమింగలం చిక్కింది. ఓ జిల్లా స్థాయి ఉన్నతాధికారి లంచం తీసుకుంటూ హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎసిబి డిఎస్పి సాంబయ్య తెలిపిన కథనం ప్రకారం వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ కార్యాలయంలో వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి గత రెండేళ్ల నుంచి అడిషనల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల హనమకొండ డిఇఓ బదిలీపై వెళ్లడంతో ఇన్చార్జి డిఇఒగా అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యాశాఖకు సంబంధించి ఒక ఫైల్ క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశాడు. వరంగల్ రేంజ్ ఎసిబి డిఎస్పి సాంబయ్య ఆధ్వర్యంలో పకడ్బందీగా వల పన్ని శుక్రవారం అదనపు కలెక్టర్, హనుమకొండ ఇన్చార్జి డిఈఓ అయిన వెంకట్‌రెడ్డిని పట్టుకున్నారు. హనుమకొండ కలెక్టర్ కార్యాలయం కాంప్లెక్స్‌లోని అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో ఓ వ్యక్తి నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. అయితే ఎసిబి అధికారులు అదనపు కలెక్టర్‌తో పాటు మరో జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగిని కలెక్టర్ కార్యాలయంలోనే విచారిస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు విచారణ తర్వాత వెల్లడిస్తామని ఎసిబి డిఎస్పి సాంబయ్య తెలిపారు. ఇదిలా వుండగా, హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా వెంకటరెడ్డి బాధ్యతల స్వీకరించినప్పటి నుంచి ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి అనేక వివాదాస్పద స్థలాలను ముడుపులు తీసుకొని క్లియర్ చేసినట్లు తెలిసింది.

## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి

- డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం, డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆకాంక్షించారు. విశాఖ రైల్వే స్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్సిసి క్యాడేట్స్ గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వినయం, విధేయత, సంస్కారం, మానవతా విలువలను కూడా నేర్పించాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విధ్యనభ్యసించి తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసు కురావాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల్లో రాణించడం వల్ల విద్య ఉద్యోగాల్లో వారికి మొదటి ప్రాధాన్యం లభిస్తుందన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశలో విద్యార్థులు క్రమశిక్షణ తో ఉజ్వల భవిష్యత్తు ఏర్పరుచుకోవాలని అన్నారు.విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ వై. మీనాక్షి అలాగే బి.రామారావు, ఏబి మాణిక్యం, ఎం ఆర్ వి నర్సమ్మ, టి పద్మజ, పి సుధా, ఎస్ ఆర్ తులసి, ఏఎస్ రాజా, ఎన్ పవన్ కుమార్ కె.సాయి విమల కుమారి, ఎస్ కే మదీనా, బి.శివ ప్రసాద్, ఈ.మేరీ సుశీల, జి.ఆనంద్, సిహెచ్ ఝాన్సీ, కె .రామారావు ,ఆర్ ఏ ప్రసన్న, టి.జయ, ఏ.మణి, డి. భాస్కర్ పాల్గొన్నారు.



# జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు గద్దల సిరి ఎంపిక

- అభినందించిన కోచ్ ఓలేటి సాంబమూర్తి, సాహితీ కళాశాల యాజమాన్యం.
- ఈనెల 25 నుండి చెన్నైలో జరగే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ లో సిరి తన ప్రతిభను చాటనుంది.

**ఖమ్మం, డిసెంబర్ 05(ప్రజాస్వరం):**






తెలంగాణ రాష్ట్రం తరుపున జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఖమ్మం సాహితీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని గద్దల సిరి అత్యంత ప్రతిభను కనబరిచి శుక్రవారం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 25వ తేదీ నుండి చెన్నై (తమిళనాడు) వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ లో సిరి తన ప్రతిభను చాటనుంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిని గద్దల సిరి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధనలో తన ఆటతీరుతో జాతీయస్థాయి జట్టులో చోటు దక్కించుకోవడం ఖమ్మం జిల్లాకే గర్వకారణమని కోచ్ ఓలేటి సాంబమూర్తి అన్నారు. జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారిని సిరి ఎంపిక కావడం పట్ల జిల్లా క్రీడా, యువజన అధికారి సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయకుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి యాస రామారావు, స్కూల్ గేమ్స్ అడ్వైజర్ సైదులు సిరిని అభినందించారు. టేబుల్ టెన్నిస్ క్రీడలో సిరిని అత్యుత్తమంగా తీర్చిదిద్దటంలో ఖమ్మం పటేల్ స్టేడియం టేబుల్ టెన్నిస్ కోచ్ సాంబమూర్తి చేసిన కృషి, టేబుల్ టెన్నిస్ క్రీడ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని సిరి తల్లిదండ్రులు ప్రత్యేకంగా కొనియాడారు. ఆయన శిక్షణలోనే తమ కూతురు సిరి ఈ స్థాయికి చేరుకున్నదని కోచ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారిణి గద్దల సిరి మాట్లాడుతూ... జాతీయస్థాయిలో స్థానం సంపాదించడం నా కల అని, ఆడే అవకాశం రానే వచ్చిందన్నారు. ఇది ఒక గొప్ప గౌరవంగా భావిస్తానని, అందుకు మా కోచ్ సాంబమూర్తికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. దీనికి కృషి, పట్టుదల, సరైన మార్గనిర్దేశం ఎంతో అవసరమన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో చక్కని ఇండోర్ స్టేడియం, క్రీడాకారుల పట్ల ఆశక్తి కలిగిన ప్రభుత్వ అధికారులు సునీల్ కుమార్ రెడ్డి, క్రీడాకారులకు తోడ్పాటును అందించే టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాలసాని విజయ్ కుమార్, టేబుల్ టెన్నిస్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి కోచ్ లు మాకు దొరకటం మా అదృష్టంగా భావిస్తున్నామని వారికి క్రీడాకారుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## గోపరాజు పల్లి లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- మండల బీసీ సెల్ ప్రచార కార్యదర్శి గాజుల అంజయ్య

**వలిగొండ నవంబర్ 50(ప్రజాస్వరం):**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పంచాయతీ ఎన్నికల్లో గోపరాజు పల్లి గ్రామములో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బిఆర్ఎస్ పార్టీ మండల బీసీ సెల్ ప్రచార కార్యదర్శి గాజుల అంజయ్య అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఏ ఒక్కరు సంతోషంగా లేరని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎవరి నోట చూసిన గ్రామ ప్రజలు టిఆర్ఎస్ అభ్యర్థికే మా ఓటు అంటున్నారు. నీలం నరేందర్ కు మీ దీవెనలు ఇవ్వండి గ్రామంలో ఏ విధంగా అభివృద్ధి చేయాలో చేసి చూపిస్తాడని గాజుల అంజయ్య అన్నారు. ఏదేమైనా ప్రజలు గోపరాజు పల్లి లో నీలం నరేందర్ కు ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించారు. ఏది ఏమైనా గోపరాజుపల్లిలో ఎగిరేది పక్క గులాబీ జెండా కే మా ఓటు అని ప్రజలు అన్నారు.

## విద్యార్థినీ విద్యార్థులకు పెన్నులు నోటు పుస్తకములు పంపిణి.

**బంగారుపాళ్యం డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండల టిడిపి మాజీ అధ్యక్షులు గంగాధర నెల్లూరు మండలం టిడిపి ఎన్నికల పరిశీలకులు ఎన్.పీ.జయప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకొని కరిడివారి పల్లె గ్రామపంచాయతీలో ఉండు, ఎంపీపీ పాఠశాల నందు జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ లో విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మార్పీఎస్ నాయకులు చిత్తూరు జిల్లా కో ఇన్చార్జ్ గోపాల్, పూతలపట్టు నియోజకవర్గం ఇంచార్జ్ ఉమాపతి, చలపతిరావు, శంకర్ గార్లచే నోటు పుస్తకములు పెన్స్ విద్యార్థి సామాగ్రి శుక్రవారం పంపిణి చేశారు. విద్యార్థులకు తినుబండారాలను అందరికీ పంచిపెట్టి ఆనంధం వ్యక్తం చేయడం జరిగింది. గ్రామపంచాయతీ నందు గల ఎంపీపీ పాఠశాల నందు మెగా పేరెంట్స్ మీటింగ్ కు స్కూల్ చైర్మన్ అమ్ములు, ప్రధాన ఉపాధ్యాయురాలు స్రవంతి ఆధ్వర్యంలో సమావేశమునకు ముఖ్య అతిథులుగా కరిడి వారిపల్లె గ్రామపంచాయతీ సెక్రటరీ గుణశేఖర్ నాయుడు, సచివాలయ సిబ్బంది ఆఇషా జిలేఖ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ గుణశేఖర్ విద్యార్థి దశను గూర్చి పాఠ్యపుస్తకాలను చదువు విధానం, క్రమశిక్షణ, తల్లిదండ్రుల బాధ్యత, వ్యాయామం తదితర అంశాలను గూర్చి ప్రసంగించారు. ఈ సమావేశమునకు గ్రామ పెద్దలు రెడ్డి ప్రసాద్, నరేష్ రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, చిట్టిబాబు, టిడిపి విలేజ్ జనరల్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి

- డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం, డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

మారుతున్న కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి ఎదిగి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆకాంక్షించారు. విశాఖ రైల్వే స్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్సిసి క్యాడేట్స్ గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సమాజ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు వినయం, విధేయత, సంస్కారం, మానవతా విలువలను కూడా నేర్పించాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విధ్యనభ్యసించి తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసు కురావాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల్లో రాణించడం వల్ల విద్య ఉద్యోగాల్లో వారికి మొదటి ప్రాధాన్యం లభిస్తుందన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశలో విద్యార్థులు క్రమశిక్షణ తో ఉజ్వల భవిష్యత్తు ఏర్పరుచుకోవాలని అన్నారు.విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ వై. మీనాక్షి అలాగే బి.రామారావు, ఏబి మాణిక్యం, ఎం ఆర్ వి నర్సమ్మ, టి పద్మజ, పి సుధా, ఎస్ ఆర్ తులసి, ఏఎస్ రాజా, ఎన్ పవన్ కుమార్ కె.సాయి విమల కుమారి, ఎస్ కే మదీనా, బి.శివ ప్రసాద్, ఈ.మేరీ సుశీల, జి.ఆనంద్, సిహెచ్ ఝాన్సీ, కె .రామారావు ,ఆర్ ఏ ప్రసన్న, టి.జయ, ఏ.మణి, డి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## వనపర్తిలో ఘంటసాల 103వ జయంతి వేడుకలు

**వనపర్తి, డిసెంబర్ 5(ప్రజాస్వరం):**

కళాకారుల ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయ భవనంలో గురువారం ఘనంగా పద్మశ్రీ గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన స్వరాంజలి కార్యక్రమానికి సిటిజన్ న్యూస్ సీఈఓ డి. రవిప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు డి. రవిప్రసాద్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం మాట్లాడిన వక్తలు ఘంటసాల గారి పాటలు స్వాతంత్ర సమరయోధులలో పోరాట స్ఫూర్తిని నింపిన విషయాన్ని గుర్తుచేశారు. సమాజంలో పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో ఇలాంటి సాంస్కృతిక వేదికలు కీలక పాత్ర పోషిస్తాయని, వాటిని ప్రోత్సహించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జబ్బార్, గంధం నాగరాజు, గాయకులు రిటైర్డ్ టీచర్ సత్తార్, నందిమల్ల రాములు, ఉపాధ్యాయులు రవిప్రసాద్ గౌడ్, గంధం రాజు, వెంకట్ (పీఈటీ), ఉపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు నరేందర్, బ్రహ్మయ్య చారి, కార్యక్రమ నిర్వాహకులు గంధం రవి, మోహన్, సంజీవరావుతో పాటు సంగీతాభిమానులు పాల్గొన్నారు.



## జోయాలుక్కాస్ 'బ్రిల్లియన్స్' డైమండ్ ప్రదర్శన ప్రారంభం

**కాప్రా డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

కాప్రా మున్సిపల్ పరిధిలోని డా:ఎ.ఎస్.రావు నగర్ లో జోయాలుక్కాస్‌లో బ్రిల్లియన్స్ డైమండ్ జ్యువెలరీ షో డిసెంబర్ 5 నుంచి 21 వరకు అంగరంగ వైభవంగా జరుగుతోంది. విలాసవంతమైన వివాహ సెట్ల నుంచి ట్రెండీ డైలీ వేర్ వరకు విభిన్నమైన వజ్రాభరణాలను ఈ స్పెషల్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ప్రతి డిజైన్ ప్రత్యేకమైనది, ప్రదర్శన కాలంలో మాత్రమే అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జోయాలుక్కాస్ మాట్లాడుతూ--- "వజ్రాల శాశ్వత అందాన్ని, డిజైన్‌లోని నైపుణ్యాన్ని జరుపుకునే వేడుక ఇది ఎ.ఎస్.రావు నగర్ మా ప్రయాణంలో ప్రత్యేక స్థానం కలిగిన ప్రదేశం" అని తెలిపారు. ప్రదర్శన సందర్భంగా రూ.1 లక్షకు పైగా వజ్రాభరణాలు కొనుగోలు చేసే ప్రతి కస్టమర్‌కు ఉచిత బంగారు నాణెం అందజేస్తామని సంస్థ వెల్లడించింది. ఈప్రత్యేకడైమండ్‌షోడిసెంబర్21వరకుజోయాలుక్కాస్ఎ.ఎస్.రావునగర్‌షోరూమ్‌లో కొనసాగుతుంది. వజ్రాల కళ, అందం, నైపుణ్యం ఒకే చోట అనుభవించే అవకాశం ఇదే. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సునీల్ పీఎస్, రీజనల్ మార్కెట్ మేనేజర్ కె శ్రీనివాస్, జోయాలుక్కాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
06.12.2025
శనివారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# 1,000 రోబోటిక్ జీర్ణకోశ శస్త్రచికిత్సలు పూర్తి
# అధునాతన చికిత్సలో కేర్ హాస్పిటల్స్ కీలక ముందడుగు

- **ప్రముఖ రోబోటిక్ సర్జన్ డా. బి. బి. దాస్ నేతృత్వంలో కేర్ హాస్పిటల్స్ తూర్పు భారతదేశంలో రోబోటిక్ శస్త్రచికిత్సలకు కొత్త ప్రమాణాలు ఏర్పరుస్తోంది**

**విశాఖపట్నం, డిసెంబర్ 5(ప్రజాస్వరం):**

కేర్ హాస్పిటల్స్, విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ మరియు రోబోటిక్ సర్జన్ డా. బి. బి. దాస్, కేవలం 18 నెలల్లో 1,000 రోబోటిక్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ అరుదైన సాధనతో, తూర్పు తీరంలో వైద్య రంగం ఎంత వేగంగా ముందుకు వెళ్తుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇది కేవలం ఒక సంఖ్య కాదు —— రోగులకు అత్యంత కచ్చితత్వం, ఇంకా ఎక్కువ భద్రత, తక్కువ నొప్పి, మరియు చాలా త్వరగా కోలుకునే అవకాశం కల్పించడంలో కేర్ హాస్పిటల్స్ తీసుకుంటున్న అధునాతన టెక్నాలజీ పురోగతికి ఇది పెద్ద నిదర్శనం. గ్యాస్ట్రోఇంటెస్టినల్ అంటే శరీరంలో ఆహారం జీర్ణమయ్యే అవయవాలు (కడుపు, పేగులు, కాలేయం మొదలైనవి). వీటిలో వచ్చే సమస్యలకు శస్త్రచికిత్సలు సాధారణంగా చాలా క్లిష్టమైనవే. అయితే డా విన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టం వంటి అత్యాధునిక రోబోటిక్ సాంకేతికత వినియోగంతో శస్త్రచికిత్స చిన్న కోతలతో, తక్కువ రక్తస్రావంతో, చాలా కచ్చితంగా, సురక్షితంగా చేయడం సాధ్యమవుతోంది. దీనివల్ల రోగులు తక్కువ నొప్పితో, తక్కువ ఆసుపత్రి కాలంతో, వేగంగా ఇంటికి తిరిగి వెళ్తున్నారు. దశాబ్దాల అనుభవం కలిగిన డా. దాస్, చిన్న కోతలతో చేసే మినిమల్ ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు మరియు రోబోటిక్ శస్త్రచికిత్సల్లో ముందంజలో ఉన్న నిపుణులు. ఆయన ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్గఢ్ మరియు సమీప ప్రాంతాల రోగులకు క్లిష్టమైన జీర్ణాశయ సంబంధిత సమస్యలకు అత్యంత కచ్చితమైన, భద్రమైన చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంలో విశాఖపట్నంలోని కేర్ హాస్పిటల్స్‌లోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ & రోబోటిక్ సర్జరీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బి. బి. దాస్ మాట్లాడుతూ, "18 నెలల్లో 1,000 రోబోటిక్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సలను పూర్తి చేయడం, ఆధునిక రోబోటిక్ టెక్నాలజీ ఆరోగ్య సేవలను ఎంత వేగంగా మార్చుతోందో చూపిస్తోంది. రోబోటిక్ సిస్టమ్‌లోని కెమెరా మరియు రోబోటిక్ చేతులు చాలా చిన్నస్థాయిలో, మన కళ్లకు కనపడని స్థాయి వరకు కచ్చితంగా పని చేస్తాయి. దీని వల్ల శస్త్రచికిత్స ఎంతో భద్రంగా జరుగుతుంది, రోగికి నొప్పి చాలా తగ్గుతుంది, ఆసుపత్రిలో ఉండే రోజులు కూడా గణనీయంగా తగ్గుతాయి. అంటే, ప్రపంచ స్థాయి కచ్చితమైన శస్త్రచికిత్స సేవలను ఇప్పుడు మన ప్రాంతం కూడా పొందుతోంది," అని అన్నారు. ఈ కార్యక్రమంలో రోబోటిక్ శస్త్రచికిత్స ఎలా రోగుల ఫలితాలను పూర్తిగా మార్చేస్తుందో స్పష్టంగా చూపించారు. 50 ఏళ్ల మహిళకు సూది గుచ్చినంత చిన్న పోర్టుల ద్వారా ఒకేసారి రోబోటిక్ పిత్తాశయం తొలగింపు మరియు హిస్టెరెక్టమీ చేశారు. ఆమె కేవలం 48 గంటల్లో నొప్పి లేకుండా ఇంటికి వెళ్లి సాధారణ జీవితానికి తిరిగి చేరుకుంది. పునరావృతమయ్యే పోస్ట్‌సర్జరీ హెర్నియాతో బాధపడుతున్న 63 ఏళ్ల రోగికి, లోతైన మెష్ అమరిక మరియు ఖచ్చితమైన కుట్టుతో మచ్చలు లేకుండా



రోబోటిక్ మరమ్మత్తు చేశారు. ఆయన అసౌకర్యం లేకుండా పూర్తి ఆరోగ్యానికి చేరుకున్నారు. ప్యాంక్రియాటిక్ రాళ్లు మరియు అనియంత్రిత మధుమేహం ఉన్న మరొక రోగికి చిన్న కీహోల్ పోర్టలతో సంక్లిష్టమైన రోబోటిక్ ప్యాంక్రియాటోజెజునోస్టమీ చేశారు. ఈ రోగి కదలికలు త్వరగా ప్రారంభించుకుని, ఇన్ఫెక్షన్ రాకుండా, తక్కువ నొప్పితో కోలుకున్నారు. అత్యవసర పరిస్థితిలో, ప్రాణాంతక ప్లీహ రక్తస్రావంతో ఉన్న 15 ఏళ్ల బాలుడికి రోబోటిక్ పద్ధతిలో స్ప్లెనెక్టమీ చేసి ప్రాణం కాపాడారు. పెద్ద కోత అవసరం లేకుండా, చాలా తక్కువ రక్త నష్టంతో వేగంగా కోలుకున్నారు. ఈ కేసులు మొత్తం కలిసి చూస్తే, ఎంత క్లిష్టమైన సందర్భంలోనైనా రోబోటిక్ సర్జరీ ఫలితాలను కొత్త ప్రమాణాలకు చేరుస్తోందని నిరూపిస్తాయి. ఈసందర్భంగాకేర్‌హాస్పిటల్స్, విశాఖపట్నం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జి సుఖేష్ రెడ్డి మాట్లాడుతూ, "చాలా తక్కువ సమయంలోనే 1,000 రోబోటిక్ గ్యాస్ట్రో శస్త్రచికిత్సలు చేయడం మా వైద్యుల నైపుణ్యానికి, మా మీద ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి పెద్ద ఉదాహరణ. రోబోటిక్ టెక్నాలజీ వల్ల శస్త్రచికిత్సలు ఇంకా కచ్చితంగా, సురక్షితంగా జరుగుతున్నాయి. దీని వలన రోగులు త్వరగా కోలుకుంటున్నారు. తూర్పు భారతదేశంలోని ప్రజలకు అత్యాధునిక చికిత్సలు అందించడంలో ఇది ఒక కీలక ముందడుగు" అన్నారు. కేర్ హాస్పిటల్స్ వైద్యుల ప్రకారం, రోబోటిక్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సలు తక్కువ రక్తస్రావం, తక్కువ ఇన్ఫెక్షన్ ప్రమాదం, తక్కువ నొప్పి, త్వరగా కోలుకోవడం, అధిక కచ్చితత్వం వంటి ప్రయోజనాలతో మరింత డిమాండ్ పొందుతున్నాయి. అందుకే ఈ విధానాలపై రోగుల నమ్మకం రోజురోజుకీ పెరుగుతోంది. భవిష్యత్తు వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేర్ హాస్పిటల్స్ అప్‌గ్రేడెడ్ రోబోటిక్ ప్లాట్‌ఫార్మ్‌లు, అడ్వాన్స్‌డ్ ఇమేజింగ్ సిస్టమ్‌లు, మల్టీడిసిప్లినరీ గ్యాస్ట్రోఇంటెస్టినల్ కేర్ మార్గాలు, మరియు వేగంగా కోలుకునే ప్రోటోకాల్స్ ఏర్పాటు చేసి ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేస్తోంది. అత్యుత్తమ వైద్య నిపుణులతో మరియు ఆధునిక మౌలిక వసతులతో విశాఖపట్నం తూర్పు భారతదేశంలో అడ్వాన్స్‌డ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ కేర్ ప్రధాన కేంద్రంగా ఎదుగుతోంది.



## శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తున్న కాపులు అన్నింటా రాణించాలి

- **జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల.**

**విశాఖ పట్నం, డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తున్న కాపులు అన్నింటా రాణించాలని జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి, కాపు సంఘం నాయకులు గంట్ల శ్రీను బాబు ఆకాంక్షించారు. ఈ నెల 7వ తేదీ ఆదివారం నగరంలోని ముడసర్లోవ పార్కులో ఏర్పాటు చేయనున్న కాపుల ఆత్మీయ కలయిక వనభోజనం కార్యక్రమ గోడ పత్రికను ఆవిష్కరించి, వాటి వివరాలు తెలిపేందుకు డాబా గార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెజారిటీ సంఖ్యలో ఉన్న కాపులు శ్రమను, తెలివితేటలను నమ్ముకుని వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ ఉపాధి రాగాల్లో బాగా రాణిస్తున్నారన్నారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వన సమారాధన ఘనంగా నిర్వహిస్తా మన్నారు. కాపులు వాటి ఉపకులాలు ఐకమత్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించు కోవాలన్నారు. తమ ఐక్యతే కాపు సమాజానికి బలమైన శక్తి కాగలదన్నారు. కాపు కులస్తులందరూ ఒకే తీగపట్టీలా కలిసి వస్తే కాపుల అభ్యున్నతి దిశలో కొత్త చరిత్ర రాయ వచ్చన్నారు. కాపు యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సేనాపతి వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే పిక్నిక్ కార్యక్రమం ఐక్యతకు చిహ్నమన్నారు. కాపుల హక్కుల సాధన కోసం యువసేన కట్టుబడి ఉందన్నారు. కాపు యువత విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఉన్నత స్థితికి చేరుకోవాలని, ఆ దిశగా సామాజిక రాజకీయ చైతన్యం రావాలని ఆయన కోరారు. విశాఖ నగరంలో కాపు నాయకుడు వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. కాపుల సామాజిక సాంస్కృతిక అవసరాల కోసం కాపు సంక్షేమ భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ ఆలపించిన కాపంటే కర్షకుడు, కాపంటే రక్షకుడు, కాపంటే ప్రేమికుడు, కాపంటే శ్రామికుడు అని ఆలపించిన ప్రజా గీతం ఆకర్షణగా నిలిచింది. ఈ మీడియా సమావేశంలో శానపతి భవాని శంకర్, వైద నారాయణరావు, అన్నం తిరుపతిరావు, ఫణింద్ర నాయుడు, గంగాధర్, మదుపాడ రవి, రాజశేఖర్, ఉదయ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ టి 10 ఛాంపియన్ ట్రోఫీ 3వ స్థానంలో ఆంధ్రా జట్టు.

**విశాఖపట్నం డిసెంబర్ 5(ప్రజాస్వరం)**

టి10 టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యం లో జరిగిన రెండవ జూనియర్ నేషనల్స్ లో ఆంధ్రప్రదేశ్ మూడోవ స్థానంలో నిలిచింది. హిమాచల్ ప్రదేశ్ హమీర్ పూర్ లో జరిగిన ఈ టి10 టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్ షిప్ లో 16 రాష్ట్రాల నుండి 16 టీం లు పాల్గొన్నాయి. బెస్ట్ అఫ్ త్రి గా నిర్వహించిన ఈ టోర్నమెంట్ లో ఆంధ్రప్రదేశ్ మూడోవ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ జట్టులో అత్యధికంగా ఉన్న క్రీడాకారుల్లో బాబా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉండడం గర్వకారణమని బిట్స్ వైజాగ్ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డా. శ్రీలక్ష్మి , ప్రిన్సిపాల్ డా. ఎం.రంజాన్ బాబు అన్నారు. ఈ సందర్భంగా కరెస్పాండంట్ లక్ష్మి మాట్లాడుతూ మా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సాహం ఇస్తూ వారిని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే విధంగా కృషిచేస్తామని తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ జట్టు ని మూడోవ స్థానంలో నిలిపిన కెప్టెన్, వైస్ కెప్టెన్ టి.హవిష్ నాయుడు, ఎం. పవన్, కోచ్ కె.విజయ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జట్టు లో పాల్గొన్న క్రీడాకారులు ఎస్వీర్, రోహిత్, బాలు, సంతోష్, ఆకాష్, సాయి, వినోద్, హేమంత్, యోగి, శ్రీను, మధు, మౌళి, రాజు కుమార్, విష్ణు లను అభినందించారు.




## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

**శంకర్ పల్లి డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శంకర్ పల్లి పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. శంకర్ పల్లి నుంచి మహాలింగాపురం గ్రామం వైపు ఆటోలో తరలిస్తుండగా ఆలంకా నిగూడ గేటు వద్ద ఆటోను పోలీసులు పట్టుకున్నారు. ఆటోను కూడా సీజ్ చేశారు. ఆటోలో తరలిస్తున్న 340 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని తరలిస్తున్న వికారాబాద్ జిల్లా కోడూరుకు చెందిన సురేష్ శేఖర్ లపై కేసు నమోదు చేసినట్లు శంకర్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.




## ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో సోలిపూర్ ను అభివృద్ధి చేస్తాం.




- **సర్పంచ్ అభ్యర్థి తీనేటి సింధూజా రెడ్డి.**

**వనపర్తి ప్రతినిధి డిసెంబర్ 05(ప్రజాస్వరం):**




తనను సోలిపూర్ గ్రామ సర్పంచ్ గా గెలిపిస్తే ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి (కత్తెర గుర్తు) తీనేటి సింధు అన్నారు. శుక్రవారం ఆమె సోలిపూర్ గ్రామంలో పెద్ద ఎత్తున తమ మద్దతుదారులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోలిపూర్ గ్రామం మండల కేంద్రంగా అయ్యే అవకాశాలపై బిఆర్ఎస్ నాయకులు నీళ్లు చల్లారని తనను సర్పంచ్ గా గెలిపిస్తే ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి మండల కేంద్రాన్ని సాధిస్తామని ఆమె ఓటర్లకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు 500 బోనస్, పేదలకు సన్న బియ్యం, 200 యూనిట్ల లోపు నివాసాలకు ఉచిత విద్యుత్తు, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సోలిపూర్ ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆరు పడకల ఆసుపత్రి నిర్మించారని, కోటి రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనం వంటి పక్కా భవనాలను నిర్మించినట్లు ఆమె తెలిపారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడమే తమ ధ్యేయంగా గ్రామంలో ఎవరైనా పేదలు చనిపోతే 5000 ఆర్థిక సాయం అందిస్తున్నానని, పేదింటి ఆడబిడ్డకు తాళిబొట్టు చేయిస్తున్నానని తెలిపారు. తాను రాజకీయాల్లోకి వచ్చి సంపాదించుకోవడం కాదని, పేదలకు సేవలు చేయడమే ప్రధాన లక్ష్యంగా ఎంచుకున్నట్లు ఆమె తెలిపారు. గ్రామంలో బడుగు బలహీన వర్గాల ప్రజలతోపాటు యువకులు, మహిళల సంపూర్ణ మద్దతుతో తాను భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.



## కొండాపూర్ రాజరాజేశ్వర నగర్ లో ఆయుఃవృద్ధి వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం

**శేరిలింగంపల్లి డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. కొండాపూర్ రాజరాజేశ్వర నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుఃవృద్ధి హోమియోపతిక్ అండ్ వెల్‌నెస్ క్లీనిక్ ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయుఃవృద్ధి వ్యవస్థాపకురాలు డాక్టర్ సింధు బైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ట రామ్, సలహాదారులు చింతకింది గోవర్ధన్ గౌడ్ లను ఆలె శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి ప్రాంత వాసులకు అధునాతన హోమియోపతి సేవలతో పాటు న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకురావడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడ్డప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హోమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యంను ఎంచుకోవాలని సూచించారు. భారతీయ జీవన విధానంలో ప్రాచీన వైద్య విధానాలు ఎన్నో అందుబాటులో ఉండేవని అందులో విశిష్టమైనది మ్యూజిక్ థెరపీ అని అన్నారు. రాగాలను ఉపయోగించి రోగాలను నయం చేసే ప్రాచీన పద్ధతి కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఇటీవల మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకోవడం గొప్ప విషయమని అన్నారు. కరోనా తర్వాత మన ప్రాచీన సాంప్రదాయ వైద్య విధానానికి తిరిగి ఆదరణ లభిస్తుండడం, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం మనకెంతో గర్వకారణమని అన్నారు. వెల్‌నెస్ సెంటర్ లోని వివిధ విభాగాలను అతిథులుగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, ఎస్ బి ఐ రిటైర్డ్ ఎ జి ఎం బాల్ద అశోక్, యోగా శిక్షకులు, సీనియర్ జర్నలిస్ట్ పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేంద్రరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు హోమియో వైద్య ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈవీఎం గోదాములో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం

- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**

**వనపర్తి, డిసెంబర్ 05(ప్రజాస్వరం):**

వనపర్తి మండల తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఈవీఎం గోదాములో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉన్నాయా అనే దానిపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం త్రైమాసిక పరిశీలనలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయనతో కలిసి తనిఖీ చేశారు. ఆజ్ఞాపక యంత్రాలు, సీసీటీవీ కెమెరాలు తదితర భద్రతా పరికరాలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. పోలీసు బందోబస్తు విధులు, గోదాం చుట్టూ రౌండులు, భద్రతా సిబ్బంది జాగ్రత్తలపై వివరాలు తెలుసుకున్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులు, పోలీసులకు సూచించారు. ఈ పరిశీలనలో బిఆర్ఎస్ నుంచి సయ్యద్ జమీల్, బీజేపీ నుంచి పెద్దిరాజు, టిడిపి నుంచి కొత్తపల్లి శంకర్, బీఎస్పీకి చెందిన కుమార స్వామి, కాంగ్రెస్ నుంచి ఎన్. త్రినాథ్, సీపీఎం పరమేశ్వర్ చారి, పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999